క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

పాల్వంచ: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, కాల్వ భాస్కర్, వెంకటాచారి, వై.వెంకటేశ్వర్లు, మెలిగ మహేశ్, కాపా శ్రీను, శ్రీలతారెడ్డి, గంధం నరసింహారావు, పాబోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు డీఎస్పీ అభినందన


భిక్షమయ్యను సన్మానిస్తున్న డీఎస్పీ

కొత్తగూడెంఅర్బన్: ఇటీవల హైదరాబాదులో జరిగిన వినాయక చవితి నిమజ్జనంలో గుర్తు తెలియని వ్యక్తి పెద్ద కత్తితో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న క్రమంలో అతని వద్ద ఉన్న కత్తిని తీసుకొని అతడిని అదుపులో తీసుకున్న భిక్షమయ్య కానిస్టేబుల్‌ను మంగళవారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం సంఘం నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాగ్యారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగులకు పీఆర్‌సీ, నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ నిలిపివేసి డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులను నియమించాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు.

జీసీసీ సందర్శన

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంఘం బ్రాంచిని మంగళవారం జీసీసీ డీఎం దావీద్ సందర్శించారు. ఈ సందర్భంగా జీసీసీ గోదాములో నిల్వ ఉన్న ఇప్ప పప్పును పరిశీలించారు. పప్పును కాంటా వేయించాలని బీఎంకు సూచించారు.

ఫీజు చెల్లింపు గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా పరీక్ష ఫీజు చెల్లించనివారు ఎస్ఎస్‌సీకి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1000 అపరాధ రుసుముతో మీ సేవ/టీజీ ఆన్‌లైన్‌లో 26వ తేదీలోపు చెల్లించాలని పేర్కొన్నారు.

బస్సు రూట్ పరిశీలన

టేకులపల్లి: బోడు ఏజెన్సీ ప్రాంతానికి దశాబ్దాలుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో పలుమార్లు రాస్తారోకోలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్, కొత్తగూడెం బస్టాండ్ కంట్రోలర్ పోరండ్ల రామనర్సయ్య బోడు ఏరియాను సందర్శించి బస్సు రూట్‌ను పరిశీలించారు.

రైతు భరోసా లేదు.. రుణమాఫీ కాలేదు

- పెట్టుబడి సాయం దొరకక ఇక్కట్లు
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు


పాల్వంచలోని ఎస్‌బీఐ (ఫైల్)

పాల్వంచరూరల్: వానాకాలం సీజన్ ముగుస్తున్నా ప్రభుత్వం రైతు పెట్టుబడి సాయం ఇవ్వడం లేదు. రుణమాఫీ కాలేదు. బ్యాంకర్లు కొత్తరుణాలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో ఏడు వేల మంది రైతులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.15వేల చొప్పున రైతు భరోసా కింద ఇస్తామంటే రైతులు సంతోషపడ్డారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేటికీ రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ.10వేల చొప్పున రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం ఇచ్చేది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేటికీ రైతు భరోసా నిధులను జమ చేయకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారు. ప్రభుత్వం గతప్రభుత్వం ఇచ్చినట్లుగా రూ.10వేలు ఇస్తారా,లేక రూ.15వేలు ఇస్తారా అనే విధానాన్ని ప్రభుత్వం ప్రకటించకపోవడంతో రైతుల్లో రైతు భరోసాపై సందిగ్ధత నేలకొంది.

కొద్దిమందికే రుణమాఫీ..

మండలంలో సుమారు ఏడువేల మంది రైతులు ఉంటే అందులో ప్రభుత్వం నాలుగు విడతల్లో 2,033 మందికి మాత్రమే రుణమాఫీ చేసింది. సొసైటీలో మొత్తం 1,832 మంది రైతులు రుణాలు తీసుకుంటే ఇందులో కేవలం 591మందికి రూ.5కోట్ల రుణమాఫీ అయింది. మిగిలిన రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ కాలేదని మండలంలో 145 మంది రైతులు వ్యవసాయశాఖ అధికారికి దరఖాస్తులు చేసుకున్నారు.

కొత్తరుణాల ఊసెత్తని బ్యాంకులు..

రుణమాఫీ గందరగోళం పరిస్థితి ఇలా ఉంటే రైతు భరోసా వస్తుందో రాదో తెలియక, వానాకాలం పంట పెట్టుబడికి రైతులు కొత్తరుణాల కోసం బ్యాంకుల వద్దకు వెళితే పంట రుణాలు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల చుట్టూ తిరిగి అలిసిపోయిన రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తెచ్చుకుని పెట్టుబడి పెడుతున్న పరిస్థితి నెలకొంది.

రుణమాఫీ కాలేదు...



ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో రూ1.20 లక్షలు పంటరుణం తీసుకున్న. రుణమాఫీ కాలేదు. అధికారులకు పాసుబుక్‌తో, రేషన్, ఆధార్ కార్డులతో దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేదు. కొత్త రుణాల కోసం బ్యాంకుకు వెళ్లితే ఇవ్వనంటున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– కొర్రరాజులు, రైతు, దంతలబోరు

రైతు భరోసా అయినా ఇవ్వండి..



రూ.లక్షలోపు పంటరుణం తీసుకున్న. మాఫీ కాలేదు. మరోసారి వ్యవసాయశాఖాధికారికి దరఖాస్తు చేసిన. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలి. పెట్టుబకి ఇబ్బందులు పడుతున్నాం. వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సి వస్తోంది.

– సిద్దెల శ్రీనివాసరావు, రైతు

మహిళలకు రక్షణ కల్పించండి..


మాట్లాడుతున్న లక్ష్మి

సింగరేణి(కొత్తగూడెం): అఖిల భారత మహిళా సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 21, 22 ,23 తేదీలలో కొత్తగూడెం క్లబ్‌లో జరగనున్న ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మి కోరారు. మంగళవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జరిగిన ఐద్వా ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, హింసలు పెరిగి పోతున్నాయని, మహిళలకు రిజర్వేషన్లు కల్పించేవిధంగా ప్రభుత్వాలు పని చేయడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో మహిళల గురించి మాట్లాడుతున్న అంశాలు అప్పటి వరకే పరిమితం అవుతున్నాయన్నారు. ఇటువంటి పలు అంశాలు, మహిళలకు పూర్తి రక్షణ ఇచ్చే విధంగా చర్చించేందుకు ఈ మహాసభలు ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ మహాసభలకు అన్నివర్గాల ప్రజలు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా టౌన్ కార్యవర్గ సభ్యులు శ్యామల, రమ, నందపాటి రజిత, మరికంటి సువర్ణ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ సేవలు వినియోగించుకోవాలి

జూలూరుపాడు: కొత్తగూడెం జిల్లా కోర్టులో నిర్వహిస్తున్న మెగా లోక్‌అదాలత్ సేవలను వినియోగించుకోవాలని జూలూరుపాడు ఎస్ఐ రాణా ప్రతాప్ ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజీ పడదగిన కేసులో ఉన్నవారు రాజమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. దీనివల్ల సమయం వృథా కాదని, కక్షలు, కారుణ్యాలు తగ్గడం వల్ల స్నేహభావం పెరుగుతుందన్నారు. ఈనెల 28వ తేదీ వరకు కొత్తగూడెం జిల్లా కోర్టులో ఈ సేవలు కొనసాగనున్నట్లు చెప్పారు. వివరాలకు 8712682041 నంబరులో సంప్రదించాలని కోరారు.

టేకులపల్లి: వివాదాలు జీవితకాలం కొనసాగుతాయని, ఒక నిర్ణయానికి వస్తే సత్వరమే సమసిపోయాతని అందుకే ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 28 వరకు ఇల్లెందు కోర్టులో జరుగుతున్న మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి, బోడు ఎస్ఐలు పోగుల సురేష్, పాడిశెట్టి శ్రీకాంత్‌లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు 8712682075, 8712682077 నంబర్లను సంప్రదించాలన్నారు.

నికర లాభాలపై వాటా ఇవ్వండి..


ఇల్లెందు: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2023–24లో సాధించిన నికర లాభాలు రూ.4,701 కోట్లపై 33శాతం వాటా ప్రకటించాలని మంగళవారం పీవీకే –5 ఇంక్‌లైన్ గని ఆవరణలో నల్లబ్యాడ్జిలతో టీబీజీకేఎస్ నాయకులు నిరసన తెలిపారు. సంఘం చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం కంపెనీ సాధించిన లాభాలు, టర్నోవర్, కార్మికులకు చెల్లిస్తున్న 33శాతం, విస్తరణకు కేటాయింపుపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తుమ్మ శ్రీనివాస్, రాసూరి శంకర్, విజయ్, వెంకటేశ్వర్లు, సూరజ్, రాజ్‌కుమార్, గణేష్, రాజేందర్, వెంకట్రావ్, పూర్ణ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి లాభాలు అత్యధికంగా ఉండగా కార్మికులకు లాభాల వాటా ప్రకటన మాత్రం చాలా తక్కువగా ప్రకటించిందని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ ఆరోపించారు. మంగళవారం ఇల్లెందు జగదాంబా సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో 2022–23లో 32శాతం ప్రకటించగా ఆనాడు లాభాలు 2,222 కోట్లు రాగా ఉద్యోగులకు రూ.710 కోట్ల చెల్లించిందన్నారు. ప్రస్తుతం లాభాలు రూ.4,701 కోట్లు రాగా ప్రభుత్వం 33 శాతం మాత్రమే ప్రకటించిందన్నారు. రూ.1,551 కోట్లు ఉద్యోగులకు పంచాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం రూ.2,389 కోట్లు అభివృద్ధి పేరుతో పక్కన పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్ నాయక్, జేకే శ్రీనివాస్, శీలం రమేష్, పరుచూరి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రేణుక, దాస్యం ప్రమోద్‌కుమార్, భావ్‌సింగ్ నాయక్, లాల్‌సింగ్‌నాయక్, అబ్దుల్ నబీ, జబ్బార్, రాజేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: సింగరేణిలో 2023–24లో నికర లాభంలో వాటాను కార్మికులకు పంచకుండా యాజమాన్యం కుట్రలు చేస్తోందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు విమర్శించారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కేటీసీలో నిర్వహించిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అబ్దుల్ నబీ, అబ్బాస్, జి.చందర్, కడుదుల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిక

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఆటో యూనియన్ నాయకుడు మర్రి కృష్ణ ఏఐటీయూసీ ఆటో డ్రైవర్ యూనియన్‌లో చేరారు. సోమవారం కొత్తగూడెంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఎస్‌కే సాబీర్‌పాషా, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల హైస్కూల్ విద్యార్థులకు ప్రముఖ న్యాయవాది హరి సుబ్బారావు, ఉమాదేవి దంపతులు మంగళవారం 140 మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందించారు. హైస్కూల్ హెచ్ఎం పి.సంజీవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలకు టీఎల్ఎం సామగ్రి పంపిణీ

ఇల్లెందురూరల్: కొమరారం కాంప్లెక్స్ పరిధిలోని కొమరారం, పోలారం పాఠశాలలకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టీఎల్ఎం మేళా సామగ్రిని ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ.. ఏజెన్సీలో ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించి విద్యాభివృద్ధికి తోడ్పతున్న చేతన్ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందనీయులన్నారు.

నిర్వాసితులతో సమావేశం

టేకులపల్లి: నేషనల్ హైవే 930పీ నిర్వాసితుల సమావేశం ఈనెల 28న టేకులపల్లి తహసీల్‌లో ఉంటుందని తహసీల్దార్ నాగభవానీ మంగళవారం తెలిపారు. మండలంలో ఎన్‌హెచ్ 930పీ కారణంగా కోల్పోతున్న స్థలాలు, నివాసాలు, వ్యవసాయ భూముల వివరాలు నష్టపరిహారంపై సమావేశంలో తెలియజేసి నిర్వాసితుల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. నిర్వాసితులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

రోడ్డు వెడల్పును తగ్గించండి..

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం వరకు ప్రారంభమైన పనులపై అభ్యంతరం తెలుపుతూ బాధితులు మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఆశ్రయించారు. రహదారి విస్తరణ 43 అడుగులుగా తమకు ముందస్తు సమాచారం ఇచ్చారని, ఆ మేరకు తామే స్వచ్ఛందంగా నిర్మాణాలను తొలగించుకున్నామని వివరించారు. కానీ టెండర్‌లో 50 అడుగులు ఉందని అధికారులు చెబుతుండడం తమకు ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యా సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచరూరల్: విద్యారంగంలోని సమస్యలు కుప్పలు, కుప్పలుగా పేరుకపోతున్నాయని వాటిని వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రామ్‌చరణ్ డిమాండ్ చేశారు. మండల పరిధి బస్వతారక కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగళవారం ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. మాట్లాడుదూ.. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో ఈనెల 27వ తేదీన చలో విద్యార్థి మహాగర్జన నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సాగర్, అఖిల్, చరణ్, రవి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అందరూ పరిశుభ్రత పాటించండి..


సుజాతనగర్: మొక్కలను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్

సుజాతనగర్: పచ్చదనం, పరిశుభ్రత విషయంలో జిల్లాను ముందుభాగంలో ఉంచేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రలోని గృహసముదాయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ.. కాలనీల్లో ఇళ్ల ముందు అందరూ మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలన్నారు. అనంతరం పాత అంజనాపురం రైతు వేదికలో నిర్వహించిన గ్రామ మంచినీళ్ల సమాఖ్య ట్రైనింగ్ కార్యక్రమంలో మాట్లాడారు. నీటి కొరత, అనవసరం ఖర్చులు తగ్గించేందుకు పంచాయతీ సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: ప్రతీఒక్కరు పరిసరాలను పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కోర్టు ఆవరణలో చెత్తను న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి తొలగించారు. అనంతరం కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, ఏపీపీలు, లక్ష్మి, ఎస్.లావణ్య, విశ్వశాంతి, నాగలక్ష్మి, పురుషోత్తంరావు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటినే తాగాలి

పాల్వంచరూరల్: ప్రజలు స్వచ్ఛమైన తాగునీటిని తాగడం వలన వ్యాధుల నివారణ జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. తోగ్గూడెం వద్ద గల మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రంలో గ్రామపంచాయతీ మంచినీటి సహాయకులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నారని, వాటిని కలుషితం కాకుండా పంచాయతీ సిబ్బంది పైపులైన్ లీకులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈఈ నళినీ హ్యాండ్ పంపు మరమ్మతులు, క్లోరినేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, డీఈ సాయికృష్ణ, ఏఈ నీలావతి పాల్గొన్నారు.

30న చలో హైదరాబాద్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధనకై ఈనెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని వివిధ విభాగాల వద్ద ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని దశలవారీ పోరాటాలు నిర్వహించామని, అయినా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించటం లేదన్నారు. ఈ పరిస్థితిలో ఈనెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో సింగరేణి వ్యాపిత కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

టేకులపల్లి: యుక్త వయసు బాలికలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు మంగళవారం సులానగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. శరీరంలో వచ్చే మార్పులు, ఆరోగ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని, యుక్త వయసులో అనవసరమైన ఆకర్షణలకు గురై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. బాల్య వివాహాలు నిర్మూలించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నా, బాలికలు, మహిళల అక్రమ రవాణాకు సంబంధించి తెలిస్తే వెంటనే పోలీసులకు, సమీపంలోని అంగన్‌వాడీ టీచర్లకు తెలియజేయాలని, 1098, లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సులానగర్ పీహెచ్‌సీలో వయసుకు తగ్గ బరువు, ఎత్తు తక్కువగా ఉన్న అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు చేయించారు. హెచ్ఎం దేవదాసు, సూపర్‌వైజర్లు కె.అనురాధ, బి.నిర్మల, జి.లక్ష్మి, కె.యశోదమ్మ, టీచర్లు రాజేశ్వరి, మంగతాయారు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై దృష్టి పెట్టండి

పాల్వంచ: ఒకేషనల్ కోర్సులపై యువత దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. మంగళవారం స్థానిక నవ ఒకేషనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో వెల్డర్, ఫిట్టర్, ఏసీ రిపేరు కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యువత జీవనోపాధికి నవ ఒకేషనల్ ఇనిస్టిట్యూట్ ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేలా కృషి చేయడం అభినందనీయం అన్నారు. నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్ సీఎస్ఆర్ ఎంజీఎం ప్రసాద్, హెచ్ఆర్ ఆర్‌సీ ఎం.శంకరయ్య, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజశేఖర్, సీహెచ్.శ్రీనివాసరావు, యూఎస్ఎన్.శర్మ, రామకృష్ణ, రాజేందర్, బిన్ను, సాయి, శ్రావణ్, శ్యాం పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడాపోటీలు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం ఒక ప్రణాళిక ఎంచుకుని దాని సాధనకై కృషి చేయాలని, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. రుద్రంపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రెండు రోజులు జరిగిని పాఠశాల జోనల్ క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీరజాక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుజాత, పాఠశాల హెచ్ఎం బాలాజీ, పీఈటీ, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజంలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకం..


ఇల్లెందురూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

ఇల్లెందు: సమాజాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర ఎంతో ఉందని ఇల్లెందు ఫైర్ ఆఫీసర్ ఎం.నవీన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ ప్రారంభించగా అప్పటి నుంచి అందిలో చేరిన ఎంతోమంది తమ సేవలు అందించినట్లు చెప్పారు. కార్యక్యక్రమంలో ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తిజాన్, ప్రసాద్, పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవర్చుకుంటే భవిష్యత్‌లో మెరుగైన సమాజ నిర్మాణంలో వ్యక్తులుగా తమ వంతు పాత్ర పోషించగలుగుతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. నా కోసం కాదు.. మీ కోసం.. అనే నినాదంతో యువత పయనించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల చేత ఎన్ఎస్ఎస్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ఎన్ఎస్ఎస్ విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణవేణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా షీటీం ఎస్సై రమాదేవి హాజరై మాట్లాడారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ ఆఫ్ ది గర్ల్స్ అండ్ చైల్డ్, స్వచ్ఛభారత్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేశ్, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: నిస్వార్థంతో సేవ చేసే సైనికులే ఎన్ఎస్ఎస్ వలంటరీలు అని శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాల్వంచ కళాశాల ప్రిన్సిపల్ పద్మ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సునీత, అనురాధ, పూర్ణచందర్‌రావు, విద్యాప్రవీణ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శంకర్ అన్నారు. బస్వతారక కాలనీ పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటర్లు సమాజాభివృద్ధికి తొడ్పడాలన్నారు. నేను నా కోసం కాదు.. సమాజ సేవ కోసం అనే నినాదంతో చదువుతోపాటు సమాజ సేవకు అంకితం కావాలన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ వేడుకలు ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 3 ప్రోగ్రాం అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఫిజిక్స్, డాక్టర్ వి.శ్రీనివాస్ హాజరయ్యారు. మాట్లాడుతూ... విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవటంతోపాటు, అత్యవసర పరిస్థితుల్లో ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగించటమే ఎన్ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, సునీత, ఆశాజ్యోతి, ఆర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు వాడొద్దు..


మాట్లాడుతున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: యువత పొగాకు వాడకం మానుకోవాలని తద్వారా ప్రాణాలను కాపాడుకోవాలని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ మరియు భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారం పీహెచ్‌సీ ఆవరణలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ... భారతదేశంలో ప్రతీ సంవత్సరం 10 లక్షల పైగా మరణాలు కేవలం పొగాకు ఉత్పత్తులు తీసుకోవడం వలన జరుగుతున్నాయని తెలిపారు. పొగాకు పీల్చడం ద్వారా అతనితో పాటు కుటుంబంలోని పిల్లలు, వృద్ధులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. సీడీపీఓ మంగతార, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

పాల్వంచ: టీజీ ఎస్‌పీడీసీఎల్‌లో 2,200 జేఎల్ఎం పోస్టులకు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని టీవీఏసీ జేఏసీ కేటీపీఎస్ బ్రాంచ్ కన్వీనర్ తోట త్రినాథ్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. త్రినాథ్ మాట్లాడుతూ... అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ లేబర్‌గా ఉన్నవారిని ఆర్టిజన్‌లుగా గుర్తించారని, వారిని కన్వర్షన్ చేసి జేఎల్ఎం పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ నెల 26న సీఎండీ కార్యాలయం మింట్ కాంపౌండ్‌లో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నరసింహారెడ్డి, రాములు, ఎస్.రమేష్, టి.రమేష్, సాయికిరణ్, శారద, ప్రభాకర్, సాయిబాబు పాల్గొన్నారు.